ఆదుకుంటున్న కూరగాయల సాగు

• కలిసొచ్చిన వాతావరణం • రైతులకు ఆదాయం



రోలుగుంటలో వంగసాగు



భారీ సైజులో పండిన బీరపాదు



బుచ్చింపేటలో పండిన బెండ పంట

రోలుగుంట : వర్షాధారం కావడంతో వర్షాలు సకాలంలో కురవక వరి, చెరకు పంటలు కలసిరాక మండల రైతులు నష్టం చవి చూస్తున్నారు. వర్షాలు పడితే అతివృష్టి, లేకుంటే అనావృష్టి. దీంతో రైతులు ప్రత్యామ్నాయ సాగుపై దృష్టి సారించి అన్ని కాలాల్లోనూ డిమాండ్ ఉన్న కూరగాయల సాగుపై మక్కువ చూపుతున్నారు. మండలంలోని కుసుర్లపూడి, జానకీరాంపురం, కొమరవోలు, రోలుగుంట, భోగాపురం, కొంతలం, శరభవరం తదితర గ్రామాల్లో బీర, వంగ, బెండ, గోంగూర, కూరబొబ్బరి సుమారు 820 హెక్టార్ల పైబడి సాగు చేస్తున్నారు.

పెట్టుబడికి తగ్గ ఆదాయం...

ఎకరా విస్తీర్ణంలో బెండ సాగుకు సుమారు రూ.6 వేలు వ్యయం అవుతుంది. దుక్కలకు రూ.3వేలు, పాడి గెత్తంకు రూ.800, రెండు కిలోల విత్తనాలకు సుమారుగా రూ.800 ఖర్చవుతుంది. రెండు నెలల్లో దిగుబడి వస్తుంది. మూడు రోజులకొకసారి సుమారుగా 300 కిలోలు దిగుబడి అవుతాయి. పండిన పంటను పట్టణ ప్రాంతాలకు తరలించి టోకున విక్రయిస్తున్నారు. చీడపీడలు ఆశించకుండా వ్యవసాయ సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు వస్తాయని, స్థిరమైన ఆదాయం లభిస్తుందని రైతులు చెబుతున్నారు. అదేవిధంగా బీర పాదులు, వంగ, గోంగూర, కూరబొబ్బరి మిశ్రమ పంట వేస్తున్నారు. వంగ కావడికాయలు సుమారు 30 కిలోలు వస్తాయి.

కూలీల ఖర్చు తక్కువ..

రెండెకరాల్లో కూరగాయలు పండిస్తున్నాను. కూలీల ఖర్చు తక్కువ. కుటుంబ సభ్యులంతా కలిసి సాగు చేసుకుంటాం. కూరగాయలకు నిత్యం గిరాకీ ఉంటుంది. ధరలు బాగుంటాయి. దీంతో రైతులు కూరగాయల సాగుపైనే ఆసక్తి చూపుతున్నారు..
– కె.అప్పారావు, రైతు, జానకీరాంపురం

నీటి వసతి ఉండాలి..

కూరగాయలు ఏడాది పొడవునా పండుతాయి. ఖరీఫ్‌లో వర్షాల తడులు సరిపోతాయి. వేసవిలో నీటి వసతి కావాలి. బోర్లు, మోటారు ఉంటే ఏ సీజన్‌లో అయినా పంటలు సాగు చేసుకుని ఆదాయం పొందే అవకాశం ఉంటుంది.
– మద్దు రమణ, రైతు, రోలుగుంట

‘నానో యూరియాతో ఎంతో మేలు’



నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ వేణుగోపాల్ వ్యవసాయాధికారి సుగుణ

నాతవరం : వరి పంటకు నానో యూరియా వాడడం వల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయని తహసీల్దార్ వేణుగోపాల్ వ్యవసాయాధికారి సుగుణ అన్నారు. ఆమె బుధవారం గన్నవరం, మన్యపురట్ల, నాతవరం, మర్రిపాలెం గ్రామాల్లో గ్రామాల్లో పర్యటించారు. కాలానుగుణంగా వ్యవసాయ సాగు విధానంలో మార్పులు గమనించి రైతులు పంటల సాగు చేపట్టాలన్నారు. మండలంలో అన్ని రైతు సేవా కేంద్రాలతో పాటు పి.కె.గూడెం, గన్నవరం పీఏసీఎస్‌లలో సైతం ఎరువులు అందుబాటులో ఉంచామన్నారు. గురువారం శృంగవరం, చమ్మచింత గ్రామాల్లో గల రైతు సేవా కేంద్రాల్లో గన్నవరం పీఏసీఎస్‌లో యూరియా రైతులకు పంపిణీ చేస్తామన్నారు. అధిక రేట్లకు గాని బ్లాక్ మార్కెట్లో గానీ విక్రయిస్తే కేసులు పెడతామన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి ఘన సత్కారం



అవార్డు గ్రహీత నారాయణరావును సన్మానిస్తున్న ఎంఈవోలు సత్యనారాయణ, ప్రసాద్

కె.కోటపాడు : ఉత్తమ విద్యాబోధనతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుంటూ పలువురికి స్ఫూర్తిగా నిలుస్తున్న గొండుపాలెం హైస్కూల్ ఉపాధ్యాయులు ఎల్.వి.నారాయణరావు పలువురికి స్ఫూర్తిదాయకుడని మండల విద్యాశాఖాధికారులు సత్యనారాయణ, డి.వి.డి.ప్రసాద్ అన్నారు. రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును స్వీకరించి పాఠశాలకు వచ్చిన నారాయణరావుకు ఉపాధ్యాయులతో పాటు ఎంఈవోలు బుధవారం ఘన సన్మానం జరిపారు. నారాయణరావుకు దుశ్శాలువా వేసి జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఆర్.నాగేశ్వరరావు, ఏపీటీఎఫ్ మండలశాఖ అధ్యక్షుడు సూర్రెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉల్లాస్‌తో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



కె.కోటపాడులో సమావేశంలో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ అప్పలరాజు

కె.కోటపాడు : ఉల్లాస్ కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యుల్లో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాలని మండల పరిషత్ సూపరింటెండెంట్ ఎస్.అప్పలరాజు అన్నారు. కె.కోటపాడు వెలుగు కార్యాలయంలో అక్షర ఆంధ్ర(ఉల్లాస్) కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వెలుగు వీవోఏలు, అక్షరాస్యులుగా తీర్చిదిద్దడంలో ఆసక్తి గల ఎస్‌హెచ్‌జీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ అప్పలరాజు మాట్లాడుతూ ఒక్కో వలంటీర్ పది మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దా లని సూచించారు. ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అంశాలతో పాటు జీవన ప్రమాణాలను మెరుగుపర్చుకోవడంలో వారికి అవగాహన కల్పించాలని ఆయన తెలిపారు. ఎస్‌హెచ్‌జీల ద్వారా 1800 మంది నిరక్షరాస్యులను, ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా 1500 మంది నిరక్షరాస్యులను వలంటీర్లు అక్షరాస్యులుగా తీర్చిద్దా లని అప్పలరాజు పేర్కొన్నారు. సమావేశంలో ఏపీవో చినబాబు, సీసీలు వెంకటరావు, పి.రాంబాబు, సురేష్, పి.సత్యనారాయణ, ఉమామహేశ్వరి, ఎల్.సింహాచలంనాయుడు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గిరిజనుల భూ సమస్యలు పరిష్కరించాలి



రోలుగుంటలో ర్యాలీ చేస్తున్న పలు గ్రామాల గిరిజనులు

రోలుగుంట : మండలంలో పలు గ్రామాల గిరిజనులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ బుధవారం ఏపీ ఆదివాసీ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. గొలుగొండ మండలం పాత మల్లంపేటకు ఆర్ఓఆర్ రికార్డు మొత్తం ఆర్డీవో స్వాధీనంలో ఉంచాలని, నర్సీపట్నం ఆర్డీవో పరిధిలోని ఆదివాసీల భూ సమస్యలు పరిష్కరించాలని, అక్రమాలకు పాల్పడుతున్న గొలుగొండ ఎమ్మార్వోను విచారించి చర్యలు తీసుకోవాలని గిరిజనులు నినదించారు. ఏపీ ఆదివాసీ సంఘర్ష మోర్చ జిల్లా అధ్యక్షుడు మూసురు రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో ఎం.కె.పట్నం, రత్నంపేట పంచాయతీలకు చెందిన గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మార్వో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

15 మందికి ఉచిత శస్త్రచికిత్సలు

మాడుగుల రూరల్ : కె.జె.పురం కళ్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయం, బీఆర్‌డీఎస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రోగులను బుధవారం ఆస్పత్రికి తరలించారు. తగరపువలసలో గల అనిల్ నీరుకొండ ఆస్పత్రికి వివిధ గ్రామాల నుంచి 15 మంది రోగులను వివిధ రకాలు శస్త్రచికిత్సల కోసం తరలించినట్టు సంస్థ వ్యవస్థాపక చైర్మన్ రాపేట రామకొండలరావు తెలిపారు. వారిని ఆస్పత్రికి చెందిన బస్సుల్లో ఉచితంగా తీసుకెళ్లారని తెలిపారు. గుండె ఆపరేషన్లు, గుండెలో బ్లాకులకు స్టంట్ లు, కళ్లు, ముక్కు, చెవి, గొంతు సమస్యలతో బాధపడేవారికి శస్త్రచికిత్సలు అందిస్తారని తెలిపారు.

వారాడలో పారిశుధ్య చర్యలు



వారాడలో మెరుగు, పిచ్చిమొక్కలను తొలగిస్తున్న పంచాయితీ కార్యదర్శి సరోజిని

కె.కోటపాడు : వర్షాకాలం కావడంతో ప్రధాన వీధుల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూడడాన్ని అందరూ బాధ్యతగా గుర్తించాలని వారాడ పంచాయతీ కార్యదర్శి బి.సరోజిని అన్నారు. వారాడలో మెయిన్ రోడ్డుతో పాటు పాత పంచాయితీ కార్యాలయం పరిసరాల్లో నిల్వ ఉంటున్న మురుగునీటిని తొలగించే చర్యలు చేపట్టారు. ప్రజలంతా ప్రతీ శుక్రవారం డ్రైడేగా పాటించాలని తెలిపారు. మలేరియా, టైఫాయిడ్ వంటి రోగాలు రాకుండా పారిశుధ్యం మెరుగుపరుస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గొర్రుపోటు సౌజన్య పాల్గొన్నారు.

సంచార వైద్యసేవలు సద్వినియోగం చేసుకోండి



కింతాడలో వైద్య సేవలను పర్యవేక్షిస్తున్న సన్యాసిరావు

కె.కోటపాడు : ప్రతి నెలా రెండుమార్లు గ్రామాల్లో నిర్వహించే సంచార వైద్య సేవలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని చౌడువాడ పీహెచ్‌సీ ఎంపీహెచ్ఈవో జె.సన్యాసిరావు అన్నారు. కింతాడలో బుధవారం సంచార వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 134 మందికి ఆరోగ్య పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులను అందించారు. బీపి, సుగర్ రోగులకు ఆరోగ్య తనిఖీలు జరిపారు. గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరుపుకోవాలని కోరారు. ఎంఎల్‌హెచ్‌పీ దేవి, ఏఎన్ఎం పార్వతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్షలపై అవగాహన



విద్యార్థులకు అవగహన కల్పిస్తున్న సీఆర్‌పీ రామారావు

రావికమతం: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్(ఎన్ఎమ్ఎమ్ఎస్)పోటీ పరీక్షలపై టి.అర్జాపురం పాఠశాల్లో విద్యార్థులకు సిఆర్‌పి రామారావు బుధవారం అవగాహన కల్పించారు. 8వ తరగతి విద్యార్థులకు ప్రతి ఏటా ఈ పరీక్షలను కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తోందని, ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి 9 తరగతి నుంచి ఇంటర్ వరకు నెలకు వెయ్యి రూపాయలు చొప్పున ఆర్థిక ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు. దీనిపై విద్యార్థులకు పరీక్ష ఏవిధంగా ఉంటుందో, వాటిల్లో మెలకువలు వివరించారు.

దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల నిర్ధారణ శిబిరం



మాట్లాడుతున్న సమగ్ర శిక్ష జిల్లా సహిత విద్య సమన్వయకర్త రామకృష్ణ

నర్సీపట్నం : సమగ్రశిక్ష, ఆల్మీకో సంస్థ ఆధ్వర్యంలో నర్సీపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గస్థాయి దివ్యాంగ విద్యార్థులకు ఉచిత ఉపకరణాల గుర్తింపు నిర్ధారణ శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష జిల్లా సహిత సమన్వయకర్త బి.రామకృష్ణ మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులకు నిర్ధారణ జరిపి త్వరలోనే ఉచితంగా ఉపకరణాలను పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమానికి నియోజకవర్గంలోని 240 మంది దివ్యాంగ విద్యార్థిని, విద్యార్థులు హాజరయ్యారన్నారు. ఎంఈవో తలుపులు మాట్లాడుతూ మేధో వైకల్యం వారికి మేధో వైకల్య బోధనోపకరణాలు, శారీరక దివ్యాంగ విద్యార్థులకు బ్యాటరీ ట్రైసైకిళ్లు, వీల్‌చైర్స్, సీపీ చైర్స్, వినికిడి లోపం వారికి వినికిడి యంత్రాలు, దృష్టిలోపం గల వారికి బ్రెయిలీ కిట్లను ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. ఆల్మీకో సంస్థ వైద్య బృందం నితిన్, పాటిల్, ఆడియాలజిస్ట్ రాజేశ్వరి, ఆప్తమాలజిస్ట్ కరుణ, ఎంఈవో–2 నాగేంద్ర, హెచ్ఎం గంగాధర్, ఉపాధ్యాయులు బి.అప్పారావు, మాణిక్యం, నాయుడు, స్వామినాయుడు, దేవుళ్లునాయుడు, చిట్టికమల పాల్గొన్నారు.

బై బై బొజ్జ గణపయ్య



భారీ ఊరేగింపు నడుమ నిమజ్జనానికి తరలించిన 22 అడుగుల భారీ గణనాథుడు

నర్సీపట్నం : మున్సిపాలిటీ నూకాంభిక యూత్ ఆధ్వర్యంలో అయ్యరక వీధిలో ప్రతిష్ఠించిన 22 అడుగుల భారీ వినాయకుడి విగ్రహాన్ని భారీ ఊరేగింపు మధ్య నిమజ్జనానికి తరలించారు. వినాయక ఉత్సవాలను నూకాంబిక యూత్ వారు ఘనంగా నిర్వహించారు. నిమజ్జనం కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా బుధవారం రాత్రి నిర్వహించారు. గణనాథుడి ఊరేగింపులో చిడతల కోలాటం, తీన్‌మార్ డప్పులు, శక్తి వేషాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అబిద్‌సెంటర్, పెదబొడ్డేపల్లి మీదగా ఊరేగింపుగా తీసుకువెళ్లి యండపల్లి ఏలేరు కాలువలో నిమజ్జనం చేశారు.

మానసిక ఒత్తిడి అధిగమించాలి



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న డాక్టర్ పరమేశ్వరి

నర్సీపట్నం : యువత మానసిక ఒత్తిడికి గురైనపుడు మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు బానిసై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉమెన్ ఎంపార్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ మెంటల్ హెల్త్‌ప్రోగ్రాం సూసైడ్ ప్రివెన్షన్ టాక్‌పై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ యువత ఒత్తిడిని అధిగమించాలన్నారు. డాక్టర్ ఎల్.పరమేశ్వరి మాట్లాడుతూ ఈ వయస్సులో ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలో మానసిక ఒత్తిడిని ఏ విధంగా ఎదుర్కోవాలో అవగాహన కల్పించారు. మానసిక ఒత్తిడికి గురైనప్పుడు 14416 టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించి, మానసిక బాధ నుంచి విముక్తి పొందవచ్చు అన్నారు.

పీహెచ్‌సీని శుభ్రంగా ఉంచాలి



పీహెచ్‌సీని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో వీరజ్యోతి

మాకవరపాలెం: పీహెచ్‌సీని పరిశుభ్రంగా ఉంచాలని డిప్యూటీ డీఎం హెచ్‌వో వీరజ్యోతి ఆదేశించారు. స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్రలో భాగంగా స్థానిక పీహెచ్‌సీని ఆమె బుధవారం సందర్శించారు. వార్డు, వ్యాక్సిన్ రూం, ఆపరేషన్ థియేటర్, ఇతర పరిసరాలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసి, వైద్య సేవలపై ఆరాతీశారు. రోగుల నుంచి ఫిర్యాదులు అందితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సీతా రామలక్ష్మి, శ్రీనివాసరావు, సిహెచ్‌వో రమేష్ పాల్గొన్నారు.

జల దిగ్బంధంలో సత్తమ్మపేట కాలనీ



సత్తమ్మపేటలో ఇండ్ల మధ్యలో నిలిచిపోయిన వర్షం నీరు



బయ్యవరం రైల్వే స్టేషన్ వద్ద పంట భూమిలో చేరిన వర్షపు నీరు



కశింకోటలో మేదర వీధి రోడ్డుపై చేరిన నీరు

తుమ్మపాల: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలో శంకరం పంచాయతీ సత్తమ్మపేట కాలనీ జలదిగ్బంధంలో చిక్కుకుంది. బుధవారం కురిసిన భారీవర్షంతో పెద్ద ఎత్తున నీరు చేరి, కాలనీకి వెళ్లే అన్ని దారులు జలమయ మయ్యాయి. ఇళ్లలోకి వర్షం నీరు చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా రు. కాలనీకి దిగువన ఉన్న శ్మశానవాటికలో కొంత భాగంలో ప్రైవేటు వ్యక్తులు రోడ్డు వేయడంతో కిందకు పోవాల్సిన వర్షపునీరు కాలనీలో నిలిచిపోతోందని స్థానికులు తెలిపారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవ డం లేదని వారు వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

కశింకోట: మండలంలో బుధవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. స్థానిక పీహెచ్‌సీకి వెళ్లే రోడ్డు, మేదరవీధి, స్టేట్ బ్యాంకు, గాడి వీధి తదితర ప్రాంతాల్లో రోడ్లపైకి నీరు చేరింది. బయ్యవరం రైల్వే స్టేషన్ రోడ్డు వద్ద పంట పొలాల్లోను, అక్కడి పెద్ద చెరువులోను భారీగా నీరు వచ్చి చేరింది.

వై.ఎస్ జగన్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే గణేష్



మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన మాజీ ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం : తాడేపల్లిలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ బుధవారం కలిసారు. నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులను జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లినట్టు గణేష్ తెలిపారు.

బుచ్చెయ్యపేటలో జోరువాన



బుచ్చెయ్యపేట రోడ్డులో కురుస్తున్న జోరువాన

బుచ్చెయ్యపేట : మండలంలో జోరు వర్షం కురిసింది. బుధవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు జల్లులతో కూడిన వర్షం కురిసింది. ఎర్రవాయి ప్రాంతంగా గుర్తింపు పొందిన బుచ్చెయ్యపేట మండలంలో సరైన సాగు నీటి వనరులు లేక పోవడంతో వర్షాధారం మీదనే రైతులు పంటలు సాగు చేస్తారు. రాజాం, నీలకంఠాపురం, తురకలపూడి, పెదపూడి, గున్నెంపూడి, కేపీ అగ్రహారం, పెదమదీన, మల్లాం, ఆర్ భీమవరం, శివరాంపురం తదితర గ్రామాల్లో మెరక ప్రాంత వరి పొలాల్లో వర్షం నీరు పుష్కలంగా చేరింది. మెట్ట ప్రాంత గ్రామాల్లో ఉన్న చెరువులు, వ్యవసాయ బావుల్లో వర్షం నీరు చేరడంతో ఈ ఏడాది ఖరీఫ్ పంటలకు సాగు నీటి ఇబ్బందులు ఉండకపోవచ్చని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వరి పంటతో పాటు సరుగుడు, యూకలిప్టస్, కొబ్బరి, జీడిమామిడి మొక్కలకు ఈ వర్షం మేలు చేస్తుందని రైతులు తెలియజేస్తున్నారు.

విరిసిన బ్రహ్మ కమలాలు



మసీదు వీధిలో ఓ ఇంటి ఆవరణలో బ్రహ్మకమలాలు

మాడుగుల రూరల్: మాడుగులలో ఒక ఉపాధ్యాయురాలు ఇంట్లో బ్రహ్మకమలాలు వికసించాయి. మసీదు వీధిలో నివాసం వుంటున్న చెరుకూరి ఉష, గోవింద దంపతులు ఇంటి ఆవరణలో 24 బ్రహ్మకమలాలు బుధవారం ఉదయం వికసించాయి. ఇవి సువాసన వెదజల్లడంతో వాటిని చూడడానికి స్థానికులు తరలివచ్చారు. గతంలోనూ ఈ బ్రహ్మ కమలాలు వికసించాయని గోవింద తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ఐఆర్‌ఏడీ విధానం



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

నర్సీపట్నం : రోడ్డు భద్రతను మెరుగుపరచడమే లక్ష్యంగా ఇంటిగ్రేటెడ్ రోడ్డు యాక్సిడెంట్ డేటాబేస్(ఐఆర్‌ఏడీ) విధానాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఐఆర్‌ఏడీ, ఇడీఏఆర్ విధానంపై ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం సబ్ డివిజన్ పరిధిలోని పోలీసుస్టేషన్ల రైటర్లు, సీసీ టీఎన్ఎస్ ఆపరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఈ విధానం ద్వారా దేశంలో అందరికీ సురక్షితమైన రహదారి భద్రత కల్పించడమే ప్రధాన ఉద్దేశమన్నారు. ఐఆర్ఏడీ మొబైల్ అప్లికేషన్ రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన వివరాలు, ఫొటోలు, వీడియోతో పాటు నమోదు చేయాలన్నారు. తర్వాత సంఘటనకు ఒక ప్రత్యేక ఐడీ ఇవ్వడం జరుగుతుందన్నారు. పోలీసు అధికారి ప్రమాదాన్ని ధృవీకరించగానే ఆస్పత్రి, ఆర్‌టీవో నివేదికలు కలెక్టర్‌కు చేరుతాయన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే బాధితుడు తక్షణ చికిత్స పొందేందుకు సమీప పోలీసుస్టేషన్‌కు సమాచారం అందించవచ్చని, లేదా 112 ఎమర్జెన్సీ నంబర్‌కు కాల్ చేయవచ్చని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో సీఐ రేవతమ్మ, ఎస్ఐ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలి వితరణ



కంప్యూటర్, ప్రింటర్ అందజేస్తున్న టీచర్ హేమకుమారి

కశింకోట: మాకవరపాలెం మండలం శెట్టిపాలెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల కోసం కశింకోట 4వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు హేమకుమారి కంప్యూటర్, ప్రింటర్‌ను అందజేశారు. తన సొంత సొమ్ము రూ.70 వేలతో వీటిని సమకూర్చారు. హేమకుమారికి సర్పంచ్ అల్లు రామునాయుడు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అల్లు రామునాయుడు, హెచ్ఎం కె.వి.ఎల్. ప్రవీణ, ఉపాధ్యాయులు కరుణ, దేవి పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీనివాసరావు, తదితరులు

మాకవరపాలెం : మార్షల్ ఆర్ట్స్‌లో అవంతి ఇంజినీరింగ్ విద్యార్థులు ప్రతిభ చూపారు. కర్నూల్, శ్రీకాకుళం, విశాఖపట్నం, కోయంబత్తూర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి వుషు, బాక్సింగ్ పోటీల్లో అవంతి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో 8 మంది విద్యార్థులు ప్రతిభ చూపి మెడల్స్ సాధించారు. వీరిని అవంతి విద్యా సంస్థల చైర్మన్ ఎం.శ్రీనివాసరావు అభినందించారు. త్వరలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లోనూ ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ మోహనరావు మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులకు మార్షల్ ఆర్ట్స్‌లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్‌లు శివ, ప్రేమకుమారి, మార్షల్ ఆర్ట్స్ కోచ్‌లు ప్రియాంక, అబ్బు పాల్గొన్నారు.

విజయదుర్గ శక్తి పీఠంలో భవానీ దీక్షలు



భవానీ భక్తులకు మాలాధారణ చేయిస్తున్న గురుభవానీ ధర్మఫణి

రావికమతం : వమ్మవరంలోని విజయదుర్గ శక్తి పీఠంలో సుమారు 100 మంది భక్తులు బుధవారం అర్ధ మండలం (21రోజులు) భవానీ మాలలు వేసి దీక్ష ప్రారంభించారు. వారికి శక్తి పీఠం పురోహితులు, గురుభవానీ ధర్మఫణి మాలాధారణ చేశారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త చౌదరి అన్ని ఏర్పాట్లు చేశారు. ధర్మకర్త ఆధ్వర్యంలో ప్రతి ఏటా దేవి నవరాత్రుల్లో భవానీ భక్తులకు వడి కార్యక్రమం ఏర్పాటు చేస్తారని పురోహితులు ధర్మఫణి తెలిపారు.